క్లుప్తంగా

19 మంది జూదరులపై కేసు

ఎంవీపీకాలనీ: జూదం ఆడుతూ పట్టుబడ్డ 19 మందిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్.మల్లేశ్వరరావు బృందం విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి మద్దిలపాలెం చైతన్యనగర్‌లోని హ్యాపీ సర్వీస్ గెస్ట్‌హౌస్‌లో తనిఖీలు నిర్వహించారు. దీంతో అక్కడ జూదం ఆడుతున్న 19 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.74,790 నగదుతో పాటు, 17 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అలరించిన హరికథ



హరికథ చెబుతున్న యతిరాజ్ భాగవతార్ బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. బి.యతిరాజ్ భాగవతార్ బృందం ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. పట్టాభిరెడ్డి తోటలో సంపత్ వినాయగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వరాల తల్లి పద్మావతిదేవి

మురళీనగర్: భక్తులకు వరాలు ప్రసాదించే కల్పవల్లి పద్మావతి అమ్మవారని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు శేషాచార్యులు అన్నారు. ధర్మప్రచారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆయన అనుగ్రహభాషణం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శేషాచార్యులను ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు మధుమోహన్, బంగార్రాజు, విశ్వస్వరూప్, సురేష్, పరశురాముడు, శ్రీరాములు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రామచంద్రరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవాలు



సంకీర్తనలు ఆలపిస్తున్న సుధా సీతాపతిరావు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సుధా సీతాపతిరావు సంకీర్తనలు ఆలపించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి.వి. రమాబాయి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



పూజలందుకున్న ఉత్సవ మూర్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకులు, వేద పండితులు అభిషేకాలు, పూజలు చేశారు.

నమామి దుర్గే.. స్మరామి దుర్గే

"శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశనీ, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియవాదినీ."అంటూ వాడవాడలా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో చివరి రెండు రోజులైన మహర్నవమి, విజయదశమి పురస్కరించుకుని ఆలయాలు, దుర్గమ్మ మండపాల్లో విశేష పూజలు జరిగాయి. మహిళలు భారీ ఎత్తున శమీవృక్ష పూజ, నక్షత్ర దీపాలంకరణ, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

- ఘనంగా దసరా ఉత్సవాలు
- ఆలయాలు, మండపాలకు పోటెత్తిన భక్తులు
- భక్తి ప్రపత్తులతో వాహన, ఆయుధ పూజలు



పోలమాంబ ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులతో ఆలయ ఈవో



పోలమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న పురోహితులు

ఏయూక్యాంపస్: దసరా ఉత్సవాలను భక్తిప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలకు పండగ శోభ సంతరించుకుంది. శరన్నవరాత్రుల్లో భాగంగా చివరి రెండు రోజులైన సోమ, మంగళవారాలు మహర్నవమి, విజయదశమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- గత తొమ్మిది రోజులుగా పోలమాంబ ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రెండు రోజులు అమ్మవారు మహిషాసురమర్దినిగా, శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలో ఏర్పాటు చేసిన భక్తి గీతాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.గాయత్రి, ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకర్ రెడ్డిలు అందించారు.
- శ్రీ లలితా సుందరేశ్వర పీఠంలో సోమవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా, మంగళవారం శ్రీ లలితా రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం శమీవృక్ష పూజ, నక్షత్ర దీపాలంకరణ సేవ జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాని వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.
- పెదవాల్తేరు జంక్షన్ ఆటోస్టాండ్ వద్ద దుర్గాదేవిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పెదవాల్తేరులోని పలు వీధుల్లో దుర్గా దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

నేడు లలితా సుందరేశ్వరుల కల్యాణం

శరన్నవరాత్రులలో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ బుధవారం లలితా సుందరేశ్వర పీఠంలో శ్రీ లలితా సందరేశ్వర స్వామి వార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కాందూరి లక్ష్మణ స్వామి తెలిపారు. ఉదయం 10 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవరసిద్ధి వినాయకుడిని వివిధ ఫలరసాలతో అభిషేకార్చన జరపనున్నారు.

ఏయూలో వాహన పూజలు

దసరా పండగను ఏయూలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఏయూ ట్రాన్స్‌పోర్ట్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ అధికారుల వాహనాలు, బస్సులకు పూజలు జరిపారు. కార్యక్రమానికి ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ట్రాన్స్‌పోర్ట్ విభాగం డీన్ మహ్మద్ ఖాన్, ట్రాన్స్‌పోర్ట్ విభాగం సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఏఆర్ పోలీసుల ఆయుధ పూజ

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి పోలీస్ మైదానంలో ఏఆర్ పోలీసులు మంగళవారం దసరా సందర్భంగా ఆయుధ పూజ చేశారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలను అమ్మవారి చిత్ర పటం వద్ద ఉంచి, పూజించారు. ఈ పూజలకు అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దంపతులు హాజరయ్యారు. పోలీస్ అధికారులతో పాటు ఎస్పీ దంపతులు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, సతీష్, అరవింద కిశోర్, ఎస్ఐలు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న గోవింద్

అన్నసమారాధన

బీచ్‌రోడ్డు: దేవీ నవరాత్రుల సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డు బలరాంనగర్‌లో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీత గోవింద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్ సూరి బాబు రాజు, గంప గణేష్ పాల్గొన్నారు.



లలిత పీఠంలో దసరా ఉత్సవాలు



పోలమాంబ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో



కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయంలో అమ్మవారిని పూజిస్తున్న ఎస్పీ దంపతులు



దుర్గాదేవికి పూజ చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ విభాగం సిబ్బంది

సాయినాథునికి ఘన దీపారాధన



చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



భక్తులు వెలిగించిన దీపాలు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో విజయదశమి, సాయినాథుని 105వ మహాసమాధి ఉత్సవం సందర్భంగా మంగళవారం దీపారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు 9 వేల దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులు వాటిలో కొబ్బరి నూనె పోసి జ్యోతులు వెలిగించారు. స్వామికి సాయంత్రపు సేవ అనంతరం కాగడా హారతి నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దీపారాధన ప్రారంభించారు. ఆరిలోవ, చినగదిలి, పెదగదిలి, సంతపాలెం, దీన్‌దయాల్‌పురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, దీపారాధనలో పాల్గొని, దీపాలు వెలిగించారు. స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సదర్భంగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ ఈ ఆలయంలో 28 సంవత్సరాలుగా విజయదశమి, స్వామి మహా సమాధి ఉత్సవాలను పురస్కరించుకుని క్రమం తప్పకుండా దీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జమ్మి ఉత్సవం.. పరవశించిన భక్త జనం



విద్యుత్ కాంతుల్లో పూలతోటలోని శ్రీకృష్ణ కొలను



కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరి భక్తుల తాకిడితో పులకించింది. అంతటా ఆధ్యాత్మికత ఉట్టిపడింది. మంగళవారం విజయదశమి పర్వదినాన స్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి జరిగిన జమ్మివేట ఉత్సవంలో భక్తులు తరించారు. రామాలంకారంలో స్వామిని కనులారా వీక్షించి పరవశించారు. విద్యుత్ కాంతులతో కొండదిగువ పూలతోట నూతన శోభ సంతరించుకుంది. ఉత్సవాన్ని తిలకించేందుకు పూలతోటకు వేలాది మంది భక్తులు క్యూ కట్టారు. సాయంత్రం 5 గంటల సమయంలో సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో స్వామివారిని తీసుకొచ్చారు. అక్కడ దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అధికారులు, అడవివరం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటలోకి తీసుకెళ్లారు. పూలతోటలోని మండపంలో జమ్మివేట ఉత్సవం విశేషంగా జరిగింది. అడవివరం పురవీధుల్లో అశ్వవాహనంపై తిరువీధి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, సువ్వాడ శ్రీదేవి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు కొర్రబియ్యం పాయసం

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదంతో పాటు కొర్రబియ్యం పాయసం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి భక్తులతో పాటు కలిసి అన్నప్రసాద భవనంలో సహపంక్తి భోజనం చేశారు. ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



భోజనం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ

మధురవాడ: తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21, 22న నిర్వహించిన తైక్వాండో పోటీల్లో మధురవాడకు చెందిన నలుగురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ తైక్వాండో చాంపియన్ షిప్ – 2023 పోటీలు జరిగాయి. ఇందులో మధురవాడకు చెందిన ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్‌కు చెందిన ఎస్.నిఖిల్ (41 కేజీలు), పి.వెంకటేష్ (57 కేజీలు) బంగారు పతకాలు, ఎ.పవిత్ర (47 కేజీలు), పి.భార్గవి (51 కేజీలు) రజిత పతకాలు సాధించారు. విజేతలను ఏఎస్పీలు జె.కులశేఖర్, జె.వెంకటరావు, ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి, గ్రాండ్ మాస్టర్ కె.బాబూరావు, అధ్యక్షులు వి.విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఆనంద్ పాల్గొన్నారు.



అతిథులతో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

యువతి అదృశ్యం

మద్రిపాలెం: కుమార్తె అదృశ్యమైందని ఆమె తల్లి ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గవర కంచరపాలెం దరి రామమూర్తి పంతులుపేటలో ముద్దుని దుర్గాప్రసాద్, భార్య కనకమహాలక్ష్మి, కుమార్తె లక్ష్మి నివసిస్తున్నారు. లక్ష్మి (18) పదో తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం ఇంట్లోనే వుంటుంది. ఈ నెల 19న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఆమెకు ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తజన సిరి.. సాగర గిరి

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



బోటు కోసం బారులు తీరిన భక్తులు



అమ్మవారి దేవాలయంలో భక్తుల కోలాహలం

అల్లిపురం : భక్తజన సిరితో సాగరగిరి కళకళలాడింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావటంతో సాగరగిరికి భక్తులు పోటెత్తారు. బోట్లు కూడా నిండుగా భక్తులను పోర్టు వేంకటేశ్వరస్వామి టెంపుల్ వద్ద నుంచి ఆవలి ఒడ్డుకు చేర్చాయి. పోర్టు యాజమాన్యం, సీఐఎస్ఎఫ్ సిబ్బంది భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. దేవాలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఉచిత ఆటోలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. సాగరగిరి దసరా ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు.

కమనీయం .. కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అదిష్ఠింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు.

దుర్గాదేవి ఆశీస్సులతో కార్మికుల విజయం తథ్యం

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి కార్మిక వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతే దీనికి నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 985వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరాను జరుపుకోవడం ఆనవాయితీ అని, దుర్గాదేవి ఆశీస్సులతో నిరవధికంగా కొనసాగుతున్న ఉక్కు పోరాటానికి త్వరలోనే విజయం చేకూరుతుందన్నారు. కార్మికులు సాధించిన విజయాన్ని గొప్పగా జరుపుకొంటామన్నారు. కేంద్రప్రభుత్వ చెడు నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నామని, దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

తీరం.. సుందరం.. మరింత భద్రం

విశాఖ అంటే ముందుగా గుర్తుకొచ్చేది ఆర్కే బీచ్. నగరాన్ని, ఆర్కే బీచ్‌ను విడివిడిగా చూడలేం. రోజూ వేల మంది సందర్శకులు వస్తుంటారు. వీకెండ్స్‌లోనైతే.. తీరం జన సంద్రమేనంటే అతిశయోక్తి కాదు. పర్యాటకులు, సందర్శకులు మక్కువ చూపే ఆర్కే బీచ్‌ను మరింత సుందరంగా, భద్రంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ యంత్రాంగం నడుం బిగించింది.

- ఆర్కే బీచ్‌లో అభివృద్ధి, రక్షణ పనులు
- సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్



సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్

బీచ్‌రోడ్డు: విశాఖ తీరంలోని రామకృష్ణా(ఆర్కే)బీచ్ ఇప్పటికే పర్యాటకులకు స్వర్గధామం. తీరంలో నాటిన కొబ్బరి చెట్లు, వాటిని ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులతో రాత్రుళ్లు వాటి అందం మరింత ఇనుమడిస్తుంది. బీచ్ రోడ్డు డివైడర్లపై కూడా వివిధ రకాల మొక్కల్ని ఏర్పాటు చేసి, అందంగా తీర్చిదిద్దారు. ఇపుడు చేపట్టిన పనులతో సాగరతీరం మరింత ఆకర్షణీయంగా కనిపించనుంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు చేపట్టిన ఆ పనులన్నీ శరవేగంగా కొనసాగుతున్నాయి.

సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్

నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన స్మార్ట్ బస్టాప్‌లు సాగర తీరానికీ చేరాయి. సుమారు రూ.16 లక్షల వ్యయంతో ఆర్కే బీచ్ వద్ద జీవీఎంసీ చేపట్టిన స్మార్ట్ బస్టాప్ నిర్మాణం దాదాపు పూర్తయింది. త్వరలో జీవీఎంసీ అధికారులు దీనిని ప్రారంభించనున్నారు. రాత్రి పూట ఈ బస్టాప్ ప్రత్యేక ఆకర్షణగా మారనుందనడంలో సందేహం లేదు. వీటి డిజైన్, లైటింగ్ బస్టాప్ పరిసరాలను అందంగా మార్చుతున్నాయి. ప్రయాణికులు సేదతీరడంతోపాటు, వీటి ముందు సెల్ఫీలు తీసుకునేందుకూ ఇష్టపడుతున్నారు.

కెరటాల నుంచి రక్షణ

విశాఖ తీరంలో బీచ్‌రోడ్డుకు అతి సమీపంలో కెరటాల తాకిడి ఉండేది ఆర్కే బీచ్ మాత్రమే. భారీ కెరటాల కారణంగా రక్షణ గోడ కోతకు గురవుతోంది. దీని వల్ల భవిష్యత్తులో బీచ్ రోడ్డు కోతకు గురవకుండా జీవీఎంసీ యంత్రాంగం సిద్ధమయింది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. దీంతో పాటు సందర్శకులు తీరంలోకి వెళ్లి, ఇసుకతిన్నెలపై సేద దీరి, అలల అందాన్ని ఆస్వాదించేందుకు వీలుగా రక్షణ గోడ నుంచి మరిన్ని మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు.



శరవేగంగా సాగుతున్న రక్షణ గోడ పనులు

కొబ్బరి చెట్ల రక్షణకు ఏర్పాట్లు

ఆర్కే బీచ్‌ను ఆనుకుని కొన్ని చోట్ల ప్రత్యేక ఏర్పాట్లతో నాటిన కొబ్బరి చెట్లకు కెరటాలు తాకిడి పెరుగుతోంది. దీంతో కోతకు గురై, నేలకు ఒరుగుతున్నాయి. వాటికి అలల ఒత్తిడి తగ్గించేలా అధికారులు రక్షణ చర్యలు ప్రారంభించారు. కొబ్బరి చెట్లు ఉండే ప్రాంతాలకు అడ్డంగా పెద్ద పెద్ద రాళ్లు వేశారు. దీంతో అలల తాకిడి తగ్గి, కొబ్బరి చెట్లు మరింత కాలం సందర్శకుల్ని ఆకట్టుకోనున్నాయి.

అర్చకునికి ఘన సన్మానం



రేవళ్లపాలెంలో ప్రవచనకర్త సత్యప్రసాద్‌శర్మను సత్కరిస్తున్న స్థానికులు

మధురవాడ: ఆధ్యాత్మిక ప్రవచనకర్త, రచయిత, సామాజికవేత్త బ్రహ్మశ్రీ భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మను రేవళ్లపాలెంలో పలువురు ఘనంగా సత్కరించారు. దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం అందరి మన్ననలు పొందింది. వందల సంఖ్యలో భక్తులు ఆయన ప్రవచనాలను విని తరించారు. ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు శ్రీమారుతి విప్ర సేవా సమితి అధ్యక్షులు గుర్నాథం శర్మ, మధురవాడ శ్రీ ఆరామ ద్రావిడ సంఘం ప్రతినిధులు వేమకోటి సుబ్బలక్ష్మి శర్మ పాల్గొన్నారు.